# తెరమీద బొమ్మలు

## కోరుకొండ సత్యానంద్

ఈ సినిమాకి 'అందరి మొగుడు' అని పేరు పెట్టారు!

ఆ సినిమాలో హీరోగారు కొన్ని తప్పనిసరి పరిస్థితుల్లో నలుగుర్ని పెళ్ళి చేసుకుంటాడు ఒకరికి తెలియకుండా మరొకరితో ఆ నలుగురికీ భర్తగా ఉంటాడు... వాళ్ళల్లో ఎవ్వరికీ తను మరొకరి భర్తగా తెలియకుండా ఉండడం కోసం నానా యాతనా పడుతుంటాడు.... కానీ సరిగ్గా 'విశ్రాంతి' సమయానికి హీరోగారు తనకేకాక మరో ముగ్గురికి భర్త అన్న విషయం ఆ నలుగురు హీరోయిన్లకూ తెలిసిపోతుంది... వాళ్ళు హీరోని నిలదీసి అడగేసి కడిగేస్తారు... హీరో వాళ్లందర్నీ అతికష్టం మీద శాంతపరచి ఏ పరిస్థితుల్లో తను అలా నలుగుర్ని పెళ్ళి చేసుకున్నాడో చెప్పడం మొదలు పెడతాడు... నలుగుర్రికీ నాలుగు 'ఫ్లాష్ బ్యాక్'లు చూపించి ఆఖర్న 'నా జీవితంలో అలా ఏర్పడ్డ విచిత్ర పరిస్థితుల్లో నేనిలా చేయవలసి వచ్చింది. ఇప్పుడు నన్ను అపార్థం చేసుకుంటారో, అర్థం చేసుకుంటారో ఆలోచించి చెప్పండి, ఇప్పుడు నన్ను ఏం చేయమంటారో కూడా మీరే చెప్పండి! అని అంటాడు... నలుగురు హీరోయిన్లు నిజాన్ని తెలుసుకొని 'ఇందులో మీ తప్పేమీలేదు, మన అయిదుగురిదీ ఓ వింత కథ, మేమీ నలుగురం మీ జీవితాన్ని సమానంగా పంచుకొని తోబుట్టువుల్లాగా మెలుగుతాం, అంతకంటే ఏముంది చేయడానికి, ఏ ఒక్కరు ఏం చేసినా మీ గుండెలో నాలుగో భాగాన్ని నరిపేసినట్లే అవుతుంది కదా' అని అంటారు... అప్పుడు హీరో రెండువైపులా ఇద్దర్ని చొప్పున నిలబెట్టుకొని ప్రేక్షకులకు టాటా చెప్తాడు... అప్పుడు 'శుభం' పలుకుతుంది!

అదీ ఆ సినిమా కథ!

ఆ సినిమాలోని సన్నివేశాలు, ఉన్న ఆరుపాటల్లోని మూడుపాటలు చిత్రీకరించడం అయిపోయింది.... మిగిలిన మూడు పాటలూ తీసేస్తే సినిమా తీయడం పూర్తవుతుంది.

ఆ సినిమాలోని పాటల చిత్రీకరణలో చాలా ఎక్కువ శ్రద్ధ తీసుకోబడింది... చిత్రీకరణ అయిపోయిన మూడుపాటల్ని హీరో ముగ్గురు హీరోయిన్లతో విడివిడిగా వాళ్ళ వాళ్ళ ఇళ్ళ దగ్గర (సినిమాలో) పాడినట్లు తీసారు.. పోతే మిగిలిన మూడు పాటలూ హీరో నాలుగో హీరోయిన్తో గెంతుతూ (అదేసార్, స్టెప్పులేస్తూ) పాడాల్సినవే!

వాటిని చిత్రీకరించడం కోసం ఆ సినిమా ఔట్డోర్ యూనిట్ అంతా ఊర్లమీదపడి లోకేషన్లు వెదకడంలో మునిగిపోయాయి.

ఇక్కడ మీకో అనుమానం రావొచ్చు, నాలుగో హీరోయిన్‌కి హీరోతో మూడుపాటలు ఇచ్చారేమిటి అని! దానికి కారణం ఉంది. ఆ నాలుగో హీరోయిన్ (సరి) క్రొత్త అమ్మాయి.. పైగా ఆ అమ్మాయిలో నటన కంటే అందం చాలా ఎక్కువగా ఉంది. అందుకే ఆవిడ ఆ సినిమాలోని సన్నివేశాల్లో కంటే పాటల్లోనే ఎక్కువగా ఏర్పాటు చేసారు. ఎందుకంటే హీరోయిన్ల అందచందాల్ని హంగు 'పొంగు'ల్ని సన్నివేశాల్లో కంటే పాటల్లోనే ఎక్కువగా చూపించొచ్చు కదండీ! పైగా క్రొత్తావిడ సారీ క్రొత్త అమ్మాయి కాబట్టి శరీరంలోని ఏ భాగాన్నైనా ఆడపిల్లకు ఎంత ముఖ్యమైన పార్ట్‌నైనా కేమేరామేన్‌గారు తన కెమేరాలోకి ఎలాగైనా ఎక్కించుకోడానికి ఎటువంటి అబ్జక్షనూ చెప్పదుకదండీ! అందులోనూ హీరోగార్కి యాభై ఏళ్ళు వచ్చినా (శరీరంతోపాటు నటనను కూడా ఏ మాత్రం పెంచలేదు లెండి ఆయనగారు) క్రొత్త హీరోయిన్ల మీద ఇంకా మోజు ఉంది కాబట్టి (అదేసార్, ముసలాళ్ళకు వయసులో ఉన్న అమ్మాయిల్ని కౌగిలించుకోవాలనీ అదీ ఉంటుందట కదండీ, అంతకంటే ఏమీ చేయలేకపోయినా), పాటల్లో తను విజృంభించడానికి అలాంటి హీరోయినే అవసరం! హీరోగారు విజృంభిస్తేనే కదండీ సినిమా అన్నది బతికి బట్టకట్ట కలుగుతుంది ఈ కాలంలో!

అందుకనే నాలుగో హీరోయిన్‌కి, హీరోగార్కి కలిపి మూడుపాటలు పెట్టాలని నిర్ణయించుకున్నారు! ఓ వారం రోజుల్లో యూనిట్ అంతా ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఎంతో ఇదిగా ఆ మూడు పాటల చిత్రీకరణనూ పూర్తిచేసారు!

ఆ మూడు పాటల్లో మొదటి పాట

తిక్క ఎక్కువై, నా బుద్ధికి తిక్క ఎక్కువై, నీ ముక్కుమీద మక్కువెక్కువై అయ్యాను మొగుడ్ని, అసలైన మొగుడ్ని నేను నవ మన్మథుడ్ని 'అని హీరో మొదలు పెడితే...

మత్తు ఎక్కువై, నా మనసుకు మత్తు ఎక్కువై, నీ మగసిరిపై కోరికెక్కువై అయ్యాను పెళ్ళాన్ని, నీకు సిసలైన పెళ్ళాన్ని నేను నవ్యరతీదేవిని అని హీరోయిన్ అందుకుంటుంది!

ఆ పాటలోని మిగతా చరణాల్లోని పదాలన్నీ ఆ పాట రాసిన రచయితగారు తను చిన్నప్పుడు ఉండే వీధిలో సారాకొట్టు దగ్గర తాగుతూ మాట్లాడుకొనేవాళ్ళ మాటల్లోనివే.... వాటినిప్పుడు 'నీటు'కొడుతూ గుర్తుకు తెచ్చుకొని ఎంతో కష్టపడి రాసాడు!

ఆ పాటలో హీరో హీరోయిన్ ముక్కు కొరికేస్తుంటాడు, నడుముని గుంజేస్తుంటాడు, తన గుండెలకి ఆమె గుండెల్ని అదేమేసుకుంటుంటాడు. హీరోయిన్ కూడా పడుకొని ఉన్న హీరోమీద పైనుండి క్రిందిదాకా దొర్లేస్తుంటుంది, అతని చేతుల్ని చీర కుచెళ్ళ దగ్గర రాసేసుకుంటుంది, అతని కాళ్ళతో నడుమును తన్నించుకుంటుంది!

తర్వాత రెండోపాట


చినుకులు చీర కుచ్చెళ్ళమీద పడుతుంటే ఏదో పొంగుతుంది ఉబుకుతుంది ఏదేదో రాజుకుంటుంది అని హీరోయిన్ మొదలుపెడితే.

చినుకులు నీ చీరను తడిపేస్తుంటే ఏదో అవుతుంది, నా మగసిరి ఇంగుతింది అని హీరో అందుకుంటాడు

పై పల్లవి ఈ పాటను రాసిన రచయితకు ఓ వర్షం రాత్రి మందుకొడుతూ ఇంటికి వెళ్తుంటే వచ్చిందట... ఇంటికి వెళ్ళిన వెంటనే ఆ తడి బట్టల్తోనే కూర్చొని గబగబా రాసేసాడంట!

జోరుగా పడుతున్న వర్షంలో పాడే ఈ పాటలో హీరో హీరోయిన్ చీరను పూర్తిగా విప్పేస్తాడు. ఆ తర్వాత ఇద్దరూ ఒకర్నొకరు పెనవేసుకొని ఓ ఆడామగా కలసి ఎన్నిరకాలుగా దొర్లగలరో అన్నిరకాలుగా దొర్లుతారు. ఈ

**జోరుగా పడుతున్న వర్షంలో పాడే ఈ పాటలో హీరో హీరోయిన్ చీరను పూర్తిగా విప్పేసాడు. ఆ తర్వాత ఇద్దరూ ఒకర్నొకరు పెనవేసుకొని ఓ ఆడా మగా కలసి ఎన్నిరకాలుగా దొర్లగలరో అన్ని రకాలుగా దొర్లుతారు.**



పాటను చిత్రీకరించడానికి అందరికంటే డాన్స్ డైరెక్టరుగారు, డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీగారే ఎక్కువగా కష్టపడ్డారు(ట)!

ఇక మూడోపాట

నీ జఘనసీమలో జీవించనీ— నీ మేని మకరందంలో మునిగిపోనీ అని హీరో మొదలుపెడితే...

నీ కౌగిలిలో నన్ను బందీకానీ నీ వెవ్వెలిగా తరియించనీ అని హీరోయిన్ అందుకుంటుంది.

భావకుడని పేరుగాంచిన ఓ కవిగారు రాసింది ఈ పాట... అతను రాసిన పాటలన్నింటికంటే ఈ పాటే అతనికి బాగా నచ్చినపాటట!

ఈ పాటలో హీరో హీరోయిన్లిద్దరూ రకరకాల పౌరాణిక జానపద డ్రస్సులు వేస్తారు. ఒకరి కాళ్ళల్లో ఒకరు, ఒకరి చేతుల్లో ఒకరు దూరిపోయి ఊగుతూ చిత్రరకంగా డాన్స్ వేస్తారు!

మొత్తానికి పై మూడు పాటల్లో ఆ సినిమా పూర్తయి విడుదలకు సిద్ధమయ్యింది.

ఆ చిత్ర నిర్మాత ప్రివ్యూ ఫంక్షన్ చాలా గ్రాండ్‌గా అరేంజి చేసాడు. ఆ ఫంక్షన్‌కి ఆ చిత్రానికి పనిచేసినవాళ్ళు, చలనచిత్ర ప్రముఖులు, పత్రికా విలేకరులు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

ఆ ఫంక్షన్లో ఓ సినిమా వారపత్రిక విలేఖరి ఒకాయన ఆ సినిమాలోని నాలుగో హీరోయిన్ దగ్గరకు వచ్చి...

"మీరు నటించిన మొదటి సినిమా ఇదే కదా, ఈ సినిమాలో హీరోయిన్‌గా నటించినప్పుడు మీరెలా ఫీలయ్యారు? నటించడం క్రొత్త, అందులోనూ ఇక్కడి మనుష్యులతో పెద్దగా పరిచయం లేదు కదా, ఇలాంటి క్రొత్త వాతావరణంలో మీరు ఏ విధమైన ఇబ్బందుల్నయినా ఎదుర్కోవలసి వచ్చిందా?" అని అడిగాడు.

విలేకరి వేసిన ప్రశ్నలకు హీరోయిన్ ముందు చిన్నగా నవ్వి ఆ తర్వాత చెప్పడం మొదలుపెట్టింది...

"క్రొత్త అయినా ఈ వాతావరణం నన్ను కన్నతల్లిలా లాలించి ఆదరించి ప్రోత్సహించింది.. ప్రతి ఒక్కరూ నాకు అన్ని విధాలా సహకరించి సహజంగా నాలో ఉండే బెరుకుదనాన్ని దూరం చేసారు. ముఖ్యంగా హీరోగారు నన్ను తన సొంత బిడ్డలా ఆదరించి నాకు ధయిర్యాన్ని మారిపోసి నేను పొరపాటు చేసినప్పుడు విసుక్కోకుండా మళ్ళీ మళ్ళీ నటించి నాతో సహకరించారు. ఆయనతోనే మళ్ళీ మళ్ళీ నటించా లని ఆయన ద్వారానే నేను పెద్ద నటిని అవ్వాలని కాంక్షిస్తున్నాను."

ఆ తర్వాత విలేకరి హీరోగారి దగ్గరకు వెళ్ళి "ఈ క్రొత్త హీరోయిన్ భవిష్యత్తు గురించి మీరేమైనా చెప్పగలరా?" అని అడిగాడు..

హీరోగారు చిద్విలాసంగా నవ్వి... "ఆ అమ్మాయికి తప్పకుండా మంచి భవిష్యత్తు ఉంది.... ఎందుకంటే నటనలో పరిపూర్ణత్వం, ప్రవర్తనలో పరిపక్వత, చెప్పింది అర్థం చేసుకొనే తెలివితేటలు ఎవరితోనైనా ఇట్టే కలిసిపోయి సొంత మనిషిలా మసలగలిగే నేర్పు ఉన్నాయి ఈ అమ్మాయికి. అలాంటి అమ్మాయి కొన్నాళ్ళు నాలాంటి హీరో ప్రక్కన నటిస్తే తప్పకుండా పెద్ద హీరోయిన్ అవ్వడం నిస్సందేహం!"

ఆ తర్వాత కూడా కొంతమంది విలేకరులు వచ్చి అవే ప్రశ్నలు వేసారు వాళ్ళని... వాళ్ళకుకూడా అలాగే చెప్పారు వాళ్ళు. వాళ్ళు చెప్పినవి విలేకరులు యధాతథంగా రాసుకొని వెళ్ళిపోయారు వాళ్ళు వాళ్ళ పత్రికాఫీసులకు...

అయితే ఆ హీరోయినూ, ఆ హీరో ఏ విలేకరికీ చెప్పని విషయాలు కొన్ని ఉన్నాయి. అవేమిటంటే

కొన్నాళ్ళు కుర్ర హీరోల వెంటపడి ఎంత ప్రయత్నించినా వాళ్ళకు ఇప్పుడు లీడింగ్‌లో ఉన్న హీరోయిన్ల వంక మాడ్డానికే టైమ్‌లేక తననసలు పట్టించుకోని పరిస్థితిలో ఈ ఏభైఏళ్ళ హీరోతో నటించడానికి అదృష్టవశాత్తూ అవకాశం రావడం ఇదే అదననుకొని ఆ హీరోగారు నటనపేరుతో తనను ఏం చేసినా ఎలా నలిపేసినా ఏమీ అనకుండా షూటింగ్ విరామ సమయాల్లో, అవుట్‌డోర్లో, హోటల్ రూముల్లో అతనికి కావాల్సినంతసేపు 'కంపెనీ' ఇచ్చి ఎంతో యాతనపడి చివరకు అతనితోపాటూ రెండేళ్ళు నటించడానికి తనను బుక్ చేసుకొనేలా 'అగ్రిమెంటు' చేసుకోవడం ముసలివాడైనా సంవత్సరానికి ఏడెనిమిది సినిమాలు నటిస్తాడు కాబట్టి రెండేళ్ళలో తను పదిహేను పదహారు సినిమాల్లో హీరోయిన్‌గా నటించడానికి వీలు కుదురుతుందని ఆ తర్వాత విషయం అప్పుడు ఆలోచిద్దామనుకోవడం

ఇవి సార్ హీరోయిన్‌గారు విలేకర్లతో చెప్పని విషయాలు!

ఇక

ఈ అమ్మాయి అందంగానూ ఉంది, దానిని తెరమీద ఎలా చూపెట్టినా అభ్యంతరం చెప్పని చక్కని మనసు ఉంది కాబట్టి తను సినిమాల్లో నటించడం. జరుగుతున్నా ప్రేక్షకాదరణ ఈ మధ్య బాగా తగ్గిపోతున్న ఈ తరుణంలో కొన్నాళ్ళపాటు ఈ అమ్మాయిని ప్రక్కన హీరోయిన్‌గా పెట్టుకుంటే ప్రేక్షకులు నా ముఖం, నా నటన చూడలేకపోయినా ఈ అమ్మాయి అందమైన అంగాల్ని చూడ్డానికైనా సినిమాలు చూస్తే నేను మళ్ళీ సక్సెస్‌ఫుల్ హీరోని అవుతాను. కాబట్టే ఆ అమ్మాయికి రెండేళ్ళపాటు నా సరసన నటించే అవకాశం ఇవ్వడం జరిగింది పైగా పాత హీరోయిన్లతో బోరు కొడుతుంది, ఈ మధ్య వాళ్ళుకూడా కాస్త అతిగా ప్రవర్తిస్తే సీరియస్సై పోవడం జరుగుతుంది అదే ఈ అమ్మాయైతే ఆ విషయంలో ఏమీ అనుకోదు, అనదు, అభ్యంతరం చెప్పదుకదా అని ఆ అమ్మాయి అడిగిన వెంటనే రెండేళ్ళు 'అగ్రిమెంటు' ఇచ్చేసాను!

అవండీ హీరోగారు విలేఖర్లతో చెప్పని విషయాలు!

*

